క్లుప్తంగా

భుదవ్ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న సోమశేఖర్ కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా స్పెన్సర్స్ ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన భుదవ్ హాస్పిటల్ గురువారం ప్రారంభమైంది. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సోమశేఖర్ తనయుడు ఈ హాస్పిటల్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కడప నగరంలో 8 ఏళ్లుగా సేవలందిస్తున్న తమ హాస్పిటల్ నేడు నూతన భవనంలోకి మారడం సంతోషంగా ఉందన్నారు. తమ హాస్పిటల్‌లో ప్లాస్టిక్ సర్జరీతోపాటు కాలిన గాయాలకు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, కాస్మటాలజీ వంటి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ బి. శ్రీనివాసులు, అవ్వారు వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి కాలంలో చిన్న పిల్లల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. గురువారం కడప నగరంలోని కొండాయపల్లెలో ఉన్న శిశు గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ శిశు గృహాలో ఉన్న పిల్లల వివరాలు, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం–20215 గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఎండీకి సత్కారం



ఎండీ ద్వారక తిరుమలరావును సత్కరిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ ద్వారక తిరుమలరావు ఐదు నేషనల్ అవార్డులు తీసుకోవడం అభినందనీయమని కార్మిక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, శేషగిరిరావులు పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ ఎండీని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కోటేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం

ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా పనిచేసిన కోటేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకమని కార్మిక పరిషత్ నాయకులు తెలిపారు. ఈనెల 31వ తేదీన కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా వారు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం, యూనియన్ నాయకులు కోసూరి సురేంద్ర, యార్లగడ్డ రమేష్, ఎస్.రాజేష్, రాష్ట్ర కమిటీ రీజినల్, జోనల్, డిపో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రేపు రన్ ఫర్ జీసస్

కడప కల్చరల్: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శనివారం ఉదయం కడపలోని సీఎస్ఐ చర్చిలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని చర్చి కమిటీ కార్యదర్శి మనోహర్‌బాబు గురువారం తెలిపారు. శనివారం ఉదయం 6.30కి చర్చి వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.చర్చి పెద్దలు పాల్గొంటారన్నారు. క్రైస్తవ విశ్వాసులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

గంగమ్మ జాతర ప్రారంభం

కడప అర్బన్ : కడపలోని నబీకోట్‌లో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 31 వరకు జరగనున్నాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపిన తరువాత చల్ల కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నబీకోట శివాలయం నుంచి ముత్తయిదువులు కళశాలతో నీరు తీసుకుని వచ్చి అమ్మవారికి గంగాజలం చేయిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉచిత సుమంగళి కుంకుమార్చన జరుగుతుంది. రాత్రి 8గంటల నుంచి 10 గంటల వరకు చిన్నపిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ఉదయం 10:35 గంటల నుంచి 11:35 గంటల వరకు శ్రీ గంగాదేవి కళ్యాణోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రి 9 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుంది. 31న (ఆదివారం) తెల్లవారు జామున 12:35 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ తదుపరి 5 గంటల నుంచి బోనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రూ. 17 లక్షలు పట్టివేత

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు గురువారం తనిఖీలను నిర్వహించి రూ. 17 లక్షలు నగదును పట్టుకుని సీజ్ చేశారు. కడప అప్సర సర్కిల్ వద్ద ఓ వ్యక్తి బైక్‌పై వస్తుండగా వాహనాన్ని తనిఖీ చేశారు. అతని వద్ద రూ. 17 లక్షలు ఎలాంటి రసీదులు లేకుండా దొరికాయి. నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన నగదును సీఐ నరసింహారెడ్డి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మానవాళికి మార్గదర్శి పవిత్ర ఖురాన్



పవిత్ర ఖురాన్ పఠిస్తున్న చిన్నారి

కడప కల్చరల్ : ప్రపంచంలోని ముస్లింలందరికీ నెల రోజుల పండుగ రంజాన్. దివ్య ఖురాన్ దైవం నుంచి ఈ భువికి అవతరించిన మాసం కూడా ఇదే. రంజాన్ మాసం కొనసాగుతున్న సందర్భంగా ఆ మోక్ష దాయిని ఖురాన్ గురించి పలువురు ఇస్లాం మత గురువులు, పెద్దలు తెలియజేశారు.

అంతిమ దైవ ప్రవక్తగా అవతరించిన మహమ్మద్ (సా.అ.వ) తరుచూ అల్లాహ్ నుంచి ఆదేశాలు అందుకునే వారు. ఆ క్షణంలో ఆయన దివ్యమైన అనుభూతిని ఆస్వాదించేవారు. దైవం నుంచి తనకు అందిన సందేశాలను తన అనుచరులకు వివరించేవారు. వారు ఆయన చెప్పిన మాటలను రాసి పెట్టి తర్వాత ప్రవక్తకు వినిపించేవారు. ఆయన అనుమతితో ఆ రాతలను భద్రపరిచేవారు. అలా 23 సంవత్సరాలపాటు దైవ సందేశాలు ప్రవక్తకు అందాయి. ఆ మొత్తం సందేశమే దివ్య ఖురాన్‌గా మానవాళికి సన్మార్గ దర్శినిగా నేటికీ విరాజిల్లుతోంది. దీంతో ఈ మాసం ప్రపంచంలోని ముస్లింలందరికీ పవిత్రమైనదిగా మారింది.

సన్మార్గ దర్శిని

దైవం దివ్య ఖురాన్‌ను ప్రపంచ మానవాళికి మహిమాన్విత వరంగా ప్రసాదించారు. అజ్ఞానపు చీకట్ల నుంచి విజ్ఞానమనే వెలుగు బాటను చూపిన ఈ దివ్య గ్రంథం మానవుడి అవివేకాన్ని తుడిచి పెట్టేందుకు ఉత్తమమైన మార్గంగా నిలుస్తోంది. మామూలు వ్యక్తిని కూడా మహోన్నతునిగా మార్చేందుకు మూలంగా నిలిచింది. ఖురాన్ పేరిట మానవాళికి అందిన ఈ వరాల మూటలో మొత్తం 30 భాగాలు ఉన్నాయి. మొదటి భాగం 'ఎక్రా' (విద్య)కు సంబంధించినది. దీని ద్వారా ముస్లింలకు చదువు తప్పనిసరి అన్న సూచన అందుతోంది. చదువు విలువను ఈ దివ్య గ్రంథంలోని ఈ భాగం ద్వారా తెలుసుకోవచ్చు. మనిషిని ఉత్తముడిగా మార్చేందుకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించాల్సిన విధుల గురించి తెలిపి మామూలు మనిషిని ఉత్తముడిగా మార్చేందుకు ఈ సూచనలు ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా ఈ మాసంలో ధనికులు జకాత్, ఫిత్రాలను సక్రమంగా అందజేస్తే రంజాన్ ఈద్ ప్రార్థన సమయానికి పేదలనే వారు ఉండరని ఈ గ్రంథం వివరిస్తుంది. మానవుడిలోని మద్యం, వ్యభిచారం, పాపం, ద్రోహం, హింస, చెడుగా చెప్పడం, కించపరచాలనుకోవడం తదితరాలను ఈ గ్రంథం తీవ్రంగా నిరసిస్తుంది. నైతిక విలువలతో జీవించాలని ప్రబోధిస్తుంది. ముఖ్యంగా స్త్రీలను బానిసలుగా చూడకూడదని, పురుషులతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలని, వాటి రక్షణ బాధ్యత పురుషుడే వహించాలని సూచిస్తోంది. అనాథలు, వితంతువులకు సహాయ కారులుగా ఉండాలని సూచిస్తోంది.

సర్వోన్నతుడు

ప్రపంచ మానవాళిని వారిని సహకరించేలా ఉన్న ప్రకృతిని, ఇతర చరాచర జీవులను సర్వోన్నతుడైన అల్లాహ్ సృష్టించారని ఈ గ్రంథం తెలుపుతోంది. అందుకే వారికి మినహా ఎవరికీ కృతజ్ఞతలు అర్పించకూడదని, ప్రార్థనలు చేయకూడదని చెబుతోంది. ఆయన ప్రకృతిలో ఎంతో విలువైన సంపదల నిధులను ఉంచారని, మానవుడు స్వశక్తితో విద్య ద్వారా సాధించిన జ్ఞానంతో వాటిని పొందవచ్చని సూచించినట్లు ఈ దివ్య గ్రంథం ప్రబోధిస్తుంది.

సశాస్త్రీయమైనది

దివ్య ఖురాన్ గ్రంథం ఎంత పవిత్రమైనదో అంత సశాస్త్రీయమైనది కూడా అని ప్రపంచ మేధావులంతా కొనియాడుతున్నారు. ప్రకృతిలో చెట్టు ఎంత విలువైనదో ఈ గ్రంథంలో కొన్నిచోట్ల ప్రస్తావించారు. మానవాళికి చెట్టు ఎంతగా ఉపయోగపడుతుందో కూడా ఇందులో వివరించారు.

ధార్మికత పెంపులో గురువుల పాత్ర ప్రశంసనీయం



శిష్యుల పాదాలు కడుగుతున్న గురువులు

కడప కల్చరల్ : క్రైస్తవ విశ్వాసుల్లో ధార్మికతను పెంచేందుకు గురువులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని సెయింట్ చర్చి మాసాపేట విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె దేవసహాయం అన్నారు. గురువారం చర్చి ఆవరణలో ఆయన గుడ్‌ఫ్రైడే ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా సంప్రదాయ సాంగ్యాలు, గురుత్వ స్థాపన, శిష్యుల పాదాలు కడగడం, కడరాత్రి భోజనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సేవ చేసే వారిని మంచి మార్గంలో నడిపించేందుకు గురుత్వ స్థానాన్ని నెలకొల్పారన్నారు. దీనికి గురువే నాయకుడని, ఆయనే తొలి సేవకుడిగా ఉంటారన్నారు. క్రీస్తు ప్రభువు స్వయంగా సేవకుడై శిష్యుల పాదాలను కడిగి సకల జాతి జనులకు సేవకులుగా ఉండాలని ఆజ్ఞాపించిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే క్రీస్తుకు ప్రపంచంలో ఎవరికీ లేని విధంగా లోక రక్షకుడిగా, కరుణామయుడిగా కీర్తి ఉందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నిస్వార్థ సేవలు అందించినపుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జేఎంజే మదర్లు, చర్చి కమిటీ పెద్దలు, కథోలిక విశ్వాసులు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరాముడు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదవాలని, ఉజ్వల భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలంటే మైండ్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి అని కడప రిమ్స్ ఆసుపత్రి ప్రముఖ మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ వెంకటరాముడు తెలిపారు. గురువారం నగర శివార్లలోని స్పిరిట్ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర అధ్యక్షతన కడప యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కేరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన విధానం సరిగా ఉంటే మానసిక రుగ్మతలకు చోటు ఉండదన్నారు. చెడు ఆలోచనలను దరి చేరనీయరాదని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ మానసిక రుగ్మతలు, వాటి పరిష్కారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌టీయూసీ



వైఎస్సార్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్మికుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు అన్నారు. గురువారం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పటి నుంచి కార్మికులు, కర్షకుల తరుపున వైఎస్సార్‌టీయూసీ పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. మున్ముందు కూడా ఇలాగే పోరాడి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు, పార్టీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, డా. శివానాయక్, విజయ్ కిషోర్, పి. సంపత్, లక్ష్మినారాయణ, సునీత, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంలో యువత ముందుండాలి



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, అధ్యాపకులు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

వైవీయూ : ఓటు హక్కు బాధ్యతగా వినియోగించుకోవడంలో యువత ముందుండాలని కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర పేర్కొన్నారు. గురువారం కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటుహక్కు వినియోగం పెరగడం ద్వారానే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ సమర్థులైన పాలకులను ఎన్నుకునే వజ్రాయుధం ఓటుహక్కు అని, దాన్ని సక్రమంగా వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. వీరభద్రయ్య, డా. గురుమోహన్‌రెడ్డి, టి. హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక పరిశోధనలతో ఆర్థికాభివృద్ధి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : ఆధునిక పరిశోధనలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని బెంగుళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ గౌరవ శాస్త్రవేత్త డాక్టర్ సంజప్ప పేర్కొన్నారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెండురోజుల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవశాస్త్రంలో ఆధునిక పరిశోధనలు చేయడం ద్వారానే నూతన ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు డా. ఆర్.ఆర్.రావు, వైవీయూ వృక్షశాస్త్ర ఆచార్యులు డా. ఎ. మధుసూదన్‌రెడ్డి, ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకురాలు డా.పి. కల్పన జీవశాస్త్రంలో జరిగే పరిశోధనలపై మాట్లాడారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ఎల్. అనంతలక్ష్మి, వైవీయూ జంతుశాస్త్ర అధ్యాపకుడు డా. ఎస్. వెంకట్రామిరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేర్చుకుంటాం..మళ్లీ..మళ్లీ

టీడీపీలో వింత పోకడ

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీలో ఇదివరకు చేరిన వారినే మళ్లీ మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరినట్లు గొప్పలు చెప్పుకోవడం పట్ల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 47వ డివిజన్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి గతంలో టీడీపీలో ఉండి 2019 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సతీమణి 47వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన పార్టీలో స్తబ్దుగా ఉంటూ ఇటీవల కడప టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మాధవిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. తాజాగా టీడీపీనేత శ్రీనివాసులరెడ్డి, మాధవీరెడ్డిలు గురువారం వారినే విజయవాడకు పిలుచుకెళ్లి చంద్రబాబు సమక్షంలో వారికి మళ్లీ పార్టీలో చేర్చుకోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీలో చేరేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంవల్లే ఇలా చేస్తూ గొప్పలు పోతున్నారని వైఎస్సార్‌సీపీ నేత జయచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు.

డీఈఓను కలిసిన ఎస్టీయూ నేతలు



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పదవ తరగతి పరీక్షలను ఏ సమస్యలు లేకుండా ప్రశాంతంగా పూర్తి చేసినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధకు ఎస్టీయూ జిల్లాశాఖ అభినందనలు తెలిపింది. గురవారం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డిలతో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాష, సంగమేశ్వరరెడ్డి డీఈఓ కార్యాలయంలో డీఈఓను కలిసి పరీక్షలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు ఆమెకు, విద్యాశాఖకు అభినందనలు తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిర్వహించబోయే పదోతరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు సదుపాయాలను కల్పించాలని ఎస్టీయూ నేతలు కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ మర్రెడ్డి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకన విధులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, న్యూరో సర్జన్, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించున్న వారికి, చంటిబిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే మూల్యాంకన కేంద్రంలో పేపర్లు దిద్దే సిబ్బందికి మజ్జిగ, చల్లని నీరు, కూలర్లను ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, కంభం బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్‌భాష, సంగమేశ్వర రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు చెన్నకేశవరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామోహన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయ ప్రతిభామూర్తి 'పుట్టపర్తి'



పుట్టపర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : పద్నాలుగు భాషల్లో పాండిత్యం కలిగి కవిగా, విమర్శకుడుగా, ఉపన్యాసకుడిగా, అనువాదకుడిగా, నాటకకర్తగా వెలుగొంది నూటికి పైగా గ్రంథాలు రచించిన 'సరస్వతీపుత్ర'డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అద్వితీయ ప్రతిభామూర్తి అని సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం ఉదయం డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతిని నిర్వహించారు. తొలుత పద్మశ్రీ పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో రాయలసీమ కీర్తిని నలుదిక్కులా చాటిన పద్మశ్రీ పుట్టపర్తి 14వ ఏట రచించిన 'పెనుగొండలక్ష్మి'కావ్యం ఆయనకు విద్వాన్ పరీక్షలో పాఠ్యాంశం కావడం సాహిత్య చరిత్రలోనే ఒక అరుదైన సంఘటన అన్నారు. ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరుడినే కావ్యనాయకునిగా ఆయన రచించిన 'శివతాండవ' కావ్యం ఎనలేని కీర్తిప్రతిష్టలను సంపాదించి పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం, శ్రీవేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సహాయపరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాపుల కోసం క్రీస్తు ప్రాణత్యాగం

నేడు గుడ్‌ఫ్రైడే

కడప కల్చరల్ : లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలి పెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. దీన్నే శుభ శుక్రవారం అని కూడా ఉంటారు. క్రైస్తవులందరూ ఈ శుభ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు. ప్రాణత్యాగ సమయంలో కూడా క్రీస్తు తనకు మరణ శిక్షను అమలు చేస్తున్న రోమ సైనికుల కోసం లోక రక్షకుడైన తన తండ్రితో 'తండ్రి వీరు ఏమి చేస్తున్నారో ఎరుగరు...వీరిని క్షమింపుము'అని ప్రార్థించారు. తన దయ, కరుణ తత్వాలను లోకానికి చాటారు. శిలువపై మరణిస్తున్న సమయంలో ఆయన చెప్పిన ఏడు సూక్తులు లోకానికి ఆరాధ్యాలయ్యాయి.

పునరుత్థానమే ఈస్టర్

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును అక్కడి కొండ గుహలో సమాధి చేశారు. మూడోరోజు ఆదివారం ఆయన పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చాడు. 'నేను జీవమును'అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటాడు. ఆయన పునరుత్థానం చెందిన ఆదివారాన్నే ఈస్టర్ సండేగా వ్యవహరిస్తారు. అశాంతితో తల్లడిల్లుతున్న నేటి ప్రపంచానికి క్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ, క్షమ గుణాలు ఆదర్శం కావాలని ఆశిద్దాం.

ముగిసిన లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ లోకం 40 రోజులపాటు లెంట్‌డేస్ (శోక దినాలు) నిర్వహిస్తోంది. ఈ సమయంలో క్రైస్తవులు ఎలాంటి శుభకార్యాలు చేయరు. నిరంతరం దైవ ధ్యానంలోనే గడుపుతారు.పొరపాటున కూడా చెడు పనులకు పాల్పడకుండా జాగ్రత్త పడతారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరు. చర్చిలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. మట్టల ఆదివారం నాటితో లెంట్‌డేస్ ముగిశాయి. శుభ శుక్రవారాన్ని, తర్వాత పునరుత్థానం సందర్భంగా ఆదివారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదాన-శిబిరంలో ఫాదర్ బిరుసు రాజాను సత్కరిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఏపీజీబీ రిటైర్డ్ ఆర్ఎం, ఇండియన్ రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మరియాపురంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన సమయంలో అవసరమైన రక్త నిల్వలు లేక మృత్యువాత పడుతున్నారని, అలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు రక్తదాతలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాదర్ బిరుసు రాజా, డాక్టర్ ఎస్ఎస్‌వీ రెడ్డి, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం కడపలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో వారానికి ఒక్కసారి కూడా నీళ్లు అందని దుస్థితి ఉందన్నారు. సమస్య పరిష్కారం చేయకపోతే ఆందోళన తప్పదన్నారు. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయని, చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైందని, ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు చర్యలు ముమ్మరం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, సి సుబ్రమణ్యం, వి వీరశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

జిల్లాలో మైదుకూరు కడప నగరంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాలుస్తోందని, సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడపలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లో జిల్లాలో తగినంత వర్షపాతం లేకపోవడంతో కుందు పెన్నా నదులు ఎండిపోయాయన్నారు. సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన బోర్లు వేయాలని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్ కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి, కడప మేయర్ సురేష్ బాబు



మొక్కులు చెల్లించుకుంటున్న కడప మేయర్ సురేష్‌బాబు

సిద్దవటం : మాధవరం గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం జాతరలో భాగంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అంతేగాకుండా కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మరికొందరు అమ్మవారికి బలులర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు వేర్వేరుగా గంగమ్మను దర్శించుకొని పూజలు చేయించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వారు స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, సర్పంచ్ చేపూరి ఓబయ్య ఇచ్చిన విందులో పాల్గొన్నారు. వీరి వెంట టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరం–1 సర్పంచ్ జానకిరామయ్య, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కె.వి.సుబ్బయ్య, మేకపాటి సుబ్బారెడ్డి, మేరువ ప్రసాద్, గోపాలస్వామి, కె.వి.సబ్బారెడ్డి, మాచనూరు సుబ్బారెడ్డి, దిలీప్, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.